






# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం, జనవరి 2, 2026

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-



## 45 రోజులు అని చెప్పాం.. 35 రోజుల్లోనే సమస్యకు పరిష్కారం చూపాం!



- శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునీకరణ పనులకు పవన్ శంకుస్థాపన
- కోనసీమ కొబ్బరి రైతు కన్నీరు కదిలించింది
- ముక్కోటి పర్వదినాన సమస్యకు పరిష్కారం చూపడం ఆనందంగా ఉంది

## డీఆర్డీవో దేశ రక్షణకు వెన్నెముక: రాజ్‌నాథ్‌సింగ్

- 68వ ఆవిరావి దినోత్సవంలో రక్షణ మంత్రి పాల్గొనడం
- ఆపరేషన్ సిందూర్‌లో డీఆర్డీవో ఆయుధాల ప్రభావం
- సుదర్శన చక్ర' రూపకల్పన బాధ్యత
- ఆత్మనిర్భర్ భారత్‌కు బలమైన ఆధారం
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యానికి పిలుపు



# పాలమూరుపై విచారణ

### ప్రాజెక్టు రూపకల్పన వెనుక అవినీతి ఛాయలు: సీఎం రేవంత్



- నీటి సోర్సు మార్పుకు మంత్రివర్గ ఆమోదమే లేదని స్పష్టీకరణ
- ప్రాణహితచేవెళ్ల తరహా ఫార్ములానే ఇక్కడా వర్తించిందన్న విమర్శ
- జూరాల నుంచి శ్రీశైలంకు మార్పుతో తెలంగాణకు తీరని నష్టం
- కృష్ణా జలాల పంపిణీలో ఏపీకి లాభం చేకూర్చిన నిర్ణయాలపై ప్రశ్నలు
- 27 వేల కోట్ల కమీషన్ల ఆరోపణలతో లిఫ్టుల బిల్లులపై అనుమానాలు
- విచారణకు మార్గదర్శకాలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం
- సభకు రాకుండా తప్పించుకుంటున్నారని కేసీఆర్‌పై సీఎం ఫైర్


హైదరాబాద్: పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు అంశం మరోసారి తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తోంది. జూరాల నుంచి శ్రీశైలంకు నీటి వనరును మార్చడం వెనుక లోతైన అవినీతి పునాదులున్నాయంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ చర్చకు దారితీశాయి. ఇది కేవలం సాంకేతిక మార్పు కాదని, లక్ష్యపూర్వకంగా తీసుకున్న విధాన నిర్ణయమని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టు సోర్సు మార్పుకు మంత్రివర్గ ఆమోదం లేదన్న విషయం అత్యంత గంభీరమని సీఎం స్పష్టం చేశారు. కీలకమైన సాగునీటి నిర్ణయాలను వ్యక్తిగత స్థాయిలో తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై ప్రశ్నించేందుకు సిద్ధమవుతుంటే ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు రావడం లేదని విమర్శించారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టులో తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్పు చేసినప్పుడు ఉపయోగించిన ఫార్ములానే పాలమూరులోనూ అమలైందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రీడిజైనింగ్ పేరుతో అంచనాలు పెంచడం, లిఫ్టులుపంపుల సంఖ్యను విపరీతంగా పెంచడం వల్ల ప్రాజెక్టు ఖర్చు అమాంతం పెరిగిందని అన్నారు. ఇది అభివృద్ధి కోసమా, కమీషన్ల కోసమా అన్న సందేహం తలెత్తుతోందని వ్యాఖ్యానించారు. జూరాల నుంచి రోజుకు నిర్ణీత పరిమాణంలో నీటిని ఎత్తుకునే అవకాశం ఉన్నప్పటికీ, శ్రీశైలంకు మార్పు చేయడం వల్ల అంతర్రాష్ట్ర వివాదాలకు తావిచ్చినట్లు సీఎం అభిప్రాయపడ్డారు. ఈ మార్పుతో ఏపీకి నీటి తరలింపు సామర్థ్యం పెరిగిందని, తెలంగాణ మాత్రం నష్టపోయిందని అన్నారు. కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులు బలహీనపడేందుకు అప్పటి నిర్ణయాలే కారణమని

(మిగతా 2వ పేజీలో)

## రేవంత్‌కు బచావత్, బ్రిజేశ్ మధ్య తేడా తెలియదు

### కేసీఆర్‌ను కసబ్‌తో పోల్చడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం

- టీఎంసీలకొద్దీ అబద్ధాలు, క్యూసెక్కులకొద్దీ అజ్ఞానం
- మర్యాద మాటలు చెప్పి అసభ్య వ్యాఖ్యలు చేస్తావా?
- నీటి హక్కులపై నిజాలు చెప్పకుండా దారి మళ్లింపు
- రేవంత్ తీరుపై మాజీ మంత్రి హరీశ్ తీవ్ర విమర్శ



హైదరాబాద్, జనవరి 1 :బచావత్ ట్రిబ్యునల్‌కు, బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కు తేడా కూడా తెలియని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అజ్ఞానం మరోసారి బహిర్గతమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో సీఎం రేవంత్ నోటి నుంచి టీఎంసీలకొద్దీ అబద్ధాలు, క్యూసెక్కులకొద్దీ అజ్ఞానం పారిందని విమర్శించారు. నదీ జలాలపై బేసిక్ నాలెడ్జ్ కూడా లేకుండా మాట్లాడటం రాష్ట్రానికి ప్రమాదకరమని అన్నారు. కేసీఆర్‌ను ఉగ్రవాది కసబ్‌తో పోల్చడం అత్యంత నీచమైన రాజకీయంగా అభివర్ణించారు. ఒకవైపు సభకు వస్తే అవమానించబోమని చెబుతూ, మరోవైపు కేసీఆర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రేవంత్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపి, కోట్లాది ప్రజలను ఏకం చేసి, ప్రాణాలకు తెగించి నిరాహార దీక్షలు చేసి రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రేవంత్ సంస్కార రాహిత్యాన్ని చూపిస్తోందని మండిపడ్డారు. రేవంత్‌కు తెలిసిందల్లా అనాగరిక భాష, అసభ్య పదజాలం, బూతు ప్రసంగాలేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డిని ఆవు తోలు కప్పుకున్న తోడేలుగా అభివర్ణించిన హరీశ్‌రావు, నీటి హక్కులపై తాను అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం ఎందుకు చెప్పలేదని నిలదీశారు. గోదావరి బనకచర్ల అంశంపై నిజంగా న్యాయపోరాటం చేస్తున్నామంటే ఢిల్లీ సమావేశాలకు ఎందుకు వెళ్లారని

(మిగతా 2వ పేజీలో)

## పాలమూరు పేరుతో బీఆర్ఎస్ ప్రజలను మోసం చేసింది: ఉత్తమ్

- 27 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు నీళ్లు లేవు
- 90 శాతం పనులు పూర్తయ్యాయన్నది పచ్చి అబద్ధం
- డీపీఆర్ ఆలస్యం చేసి వ్యయాన్ని పెంచిన బీఆర్ఎస్
- ఏపీకి లబ్ధి చేకూరేలా నిర్ణయాలు తీసుకున్నారు
- కాంగ్రెస్ హయాంలోనే పనులకు వాస్తవ గతి



హైదరాబాద్, జనవరి 1 :పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కావాలని అసత్య ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని చెబుతుండటం పూర్తిగా ప్రజలను మోసం చేయడమేనని ఆయన స్పష్టం చేశారు. గురువారం ప్రజాభవన్‌లో కృష్ణా, గోదావరి జలాలపై

(మిగతా 2వ పేజీలో)



## నూతన సంవత్సర వేడుకల్లో కఠిన తనిఖీలు

- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసులు ఉక్కుపాదం
- 2 కమిషనరేట్‌లలో 1,533 కేసులు నమోదు
- అర్ధరాత్రి నగరంలో పర్యటించిన కమిషనర్ అవినాశ్ మహంతి
- అధిక మద్యంస్థాయితో పలువురు పట్టుబాటు

## బార్ కౌన్సిల్ ఎన్నికల్లో రిజర్వేషన్లకు నో

### ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం

#### పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు



హైదరాబాద్, జనవరి 1 :రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టంగా తేల్చి చెప్పింది. ఈ మేరకు దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ న్యాయవాది పుట్టా పద్మారావు హైకోర్టును

(మిగతా 2వ పేజీలో)

# నూతన సంవత్సర వేడుకల్లో కఠిన తనిఖీలు

**డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసులు ఉక్కుపాదం**

**రెండు కమిషనరేట్‌లలో కలిపి 1,533 కేసులు నమోదు**

**అర్ధరాత్రి నగరంలో పర్యటించిన కమిషనర్ అవినాశ్ మహంతి**

**అధిక మద్యం స్థాయితో పలువురు పట్టుబాటు**

హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కమిషనర్ అవినాశ్ మహంతి బుధవారం అర్ధరాత్రి కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను స్వయంగా పరిశీలించారు. తనిఖీల తీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మొత్తం 605 కేసులు నమోదయ్యాయి. ఈ తనిఖీల్లో 36 ప్రత్యేక బృందాలు పాల్గొన్నాయి. పట్టుబడ్డ వారిలో ఎనిమిది మందికి రక్తంలో మద్యం స్థాయి 300 ఎంజీలకు పైగా ఉండగా, మరో 230 మందికి 100 ఎంజీలకు పైగా రీడింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎల్బీనగర్, వనస్థలిపురం, ఉప్పల్, కుషాయిగూడ ప్రాంతాల్లో అత్యధికంగా కేసులు నమోదు అయినట్లు వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని కోర్టులో హాజరు పరిచి, వారి డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేయాలని ఆర్టీఏకు సిఫార్సు చేయనున్నట్లు పేర్కొన్నారు.ఇక సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనూ నూతన సంవత్సరం సందర్భంగా విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు



నిర్వహించారు. మొత్తం 55 బృందాలు తనిఖీలు చేపట్టగా, 695 ద్విచక్ర వాహనాలు, 31 త్రిచక్ర వాహనాలు, 199 కార్లను పరీక్షించారు. ఈ తనిఖీల్లో 928 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ప్రజల భద్రతే లక్ష్యంగా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

# ఆపరేషన్ సిందూర్‌లో డీఆర్‌డీఓ ఆయుధాల కీలకపాత్ర

వృత్తి నిబద్ధతకు ఇదే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. డీఆర్‌డీఓ 68వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఢిల్లీలోని సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, దేశ భద్రతకు కీలకమైన 'సుదర్శన చక్ర' రక్షణ కవచం రూపకల్పన, అభివృద్ధిలో డీఆర్‌డీఓ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ మిషన్ పూర్తిస్థాయిలో విజయవంతమవుతుందన్న నమ్మకం వ్యక్తం చేస్తూ, త్వరలోనే ఈ గగనతల రక్షణ వ్యవస్థ దేశానికి అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2025 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట నుంచి 'మిషన్ సుదర్శన చక్ర'ను ప్రకటించిన విషయం తెలిసిందే.ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆధునిక యుద్ధాల్లో



ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఎంత కీలకమో స్పష్టంగా తెలిసిందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డీఆర్‌డీఓ రూపొందించిన ఆయుధాలు అద్భుతంగా పనిచేసి సైనికుల ఆత్మస్థైర్యాన్ని పెంచాయని కొనియాడారు. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో సైన్యాన్ని బలోపేతం చేయడంలో డీఆర్‌డీఓ విశ్వసనీయ సంస్థగా ఎదిగిందన్నారు.1958లో కేవలం 10 ల్యాబ్‌లతో ప్రారంభమైన డీఆర్‌డీఓ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థలలో ఒకటిగా నిలిచిందని గుర్తు చేశారు. కాలానుగుణంగా అత్యాధునిక ఆయుధాలను అభివృద్ధి చేస్తూ, వేగంగా మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలని డీఆర్‌డీఓకు ఆయన సూచించారు. నవీన ఆవిష్కరణలపై దృష్టి పెట్టడంతో పాటు, రక్షణ రంగంలో ప్రైవేట్ సంస్థలు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈల భాగస్వామ్యాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు.డీఆర్‌డీఓ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, డిపార్టుమెంట్ ఆఫ్ డిఫెన్స్ ఆర్ అండ్ డీ కార్యదర్శి, డీఆర్‌డీఓ చైర్మన్ సమీర్ వి.కామత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ 2025లో సాధించిన విజయాలు, 2026లో చేపట్టబోయే కార్యక్రమాలను అధికారులు రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. అనంతరం డీఆర్‌డీఓ సైంటిస్టులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ 'ఎక్స్' వేదికగా ఆయన అభినందనలు తెలిపారు. రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' సాధనకు డీఆర్‌డీఓ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

## శాసనసభలో బీఆర్ఎస్‌కు పవర్ పాయింట్ హక్కు ఇవ్వాలి: కేటీఆర్

కె.తారక రామారావు డిమాండ్ చేశారు. సభలోకి అడుగుపెట్టిన తర్వాత ముఖ్యమంత్రి, సాధారణ సభ్యుడు అనే తేడా ఉండదని, ప్రతి సభ్యుడికి సమాన హక్కులు ఉండాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణ భవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడిన కేటీఆర్ "ప్రభుత్వం తన వాదనలు చెప్పితే మేము మా వాదనలను తెలిపారు. గత పదేళ్లలో తెలంగాణ వ్యవసాయం, సాగునీటి వ్యవస్థలో చేసిన చర్యలను, ప్రాజెక్టుల వివరాలను సభలో వివరిస్తాం" అన్నారు. 2016 మార్చి 31న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీ బాయ్‌కాట్ చేశారని గుర్తుచేశారు. ఆ సందర్భంలో పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధంగా ఉందని విమర్శించిన కాంగ్రెస్, ఇప్పుడు అదే విధానాన్ని ఎందుకు సమర్థిస్తోంది అనే ప్రశ్నను కేటీఆర్ ప్రతిపక్షం స్పీకర్‌కు లేఖ ద్వారా అందించిందన్నారు.కేటీఆర్ ప్రధానమంత్రి శాసనసభలో అవగాహన లేకుండా ఉపన్యాసాలు ఇవ్వడం సమస్యగా చూడాలి అని అభిప్రాయపడ్డారు. గోదావరి, కృష్ణా, భాక్రానంగల్ ప్రాజెక్ట్‌లపై కనీస అవగాహన కూడా లేని ముఖ్యమంత్రి సభలో ఉపన్యాసాలు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. సుంకిశాల, దేవాదుల ప్రాజెక్టుల స్థితిని కూడా తెలియని వ్యక్తి నుంచి పాఠాలు వినడం ప్రజలకు సరైనది కాదని విమర్శించారు. "మేము ఏం నేర్చుకోవాలి? చెక్‌డ్యాంలు ఎలా ఫెయిల్ అయ్యాయో, మేడిగడ్డ, సుంకిశాల ఘటనలు ఎలా జరిగాయో, కృష్ణా నదీ హక్కులను ఏ విధంగా కేఆర్ఎంబీకి ఇచ్చారో చూపిస్తారా?" అని ప్రశ్నించారు.కేటీఆర్ పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో పక్కన పెట్టబడ్డదని ఆరోపించారు. ముఖ్యమంత్రి తరచూ "పండబెట్టి తొక్కుతాం" అనడం, ఇప్పుడు నిజంగా ప్రాజెక్టును పండించకుండా రైతులను వంచుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యానికి గౌరవం ఉంటే శాసనసభలో ప్రధాన ప్రతిపక్షానికి సమాన అవకాశాలు ఇవ్వాలి అని స్పష్టంగా డిమాండ్ చేశారు.రైతు సమస్యలపై ప్రభుత్వ విఫలతను ఉదహరించుతూ, కేటీఆర్ తెలంగాణలో యూరియా సమస్య, అభివృద్ధి పథకాల వెనుకబడిన పరిస్థితులను వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడకముందు ఉన్న పరిస్థితులు తిరిగి వస్తున్నాయి అని, పండుగ వాతావరణంలో కూడా రైతులు కష్టాల్లో ఉన్నారని గుర్తుచేశారు. "పార్శ్వ కార్యకర్తలే పార్టీ బలము, గులాబీ జెండా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక" అని కేటీఆర్ మీడియా సమక్షంలో ధ్వజమెత్తారు.

## జనవరిలోనూ చలిపులి

వాతావరణ శాఖ వివరించింది.మూడో వారం తర్వాత ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని అంచనా వేస్తుండగా, పగటి పూట కొన్ని ప్రాంతాల్లో పొగమంచు కనిపించే అవకాశముందని చెప్పారు. జనవరి నెలాఖరులో ఉత్తర, తూర్పు జిల్లాల్లో ఒకటి లేదా రెండు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం కూడా ఉందని అధికారులు వెల్లడించారు.గురువారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే, ఆదిలాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 30.8 డిగ్రీల సెల్సియస్‌గా, కనిష్ట ఉష్ణోగ్రత 11.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1 నుంచి 3 డిగ్రీల మేర తక్కువగా ఉన్నాయని తెలిపారు. తూర్పు, ఈశాన్య దిశల నుంచి గాలులు బలంగా వీస్తుండటంతో రానున్న నాలుగు రోజుల పాటు చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.



## స్విట్జర్లాండ్‌లో న్యూఇయర్ పార్టీలో విషాదం

**బార్‌లో పేలుడు, 40 మంది మృతి**

**క్రాన్స్ మోంటానా స్కీ రిసార్ట్‌లో ఘోర సంఘటన**

**ప్రమాద సమయంలో బార్‌లో 100 మందికి పైగా ప్రజలు**

హైదరాబాద్, జనవరి 1, 2026:స్విట్జర్లాండ్‌లోని క్రాన్స్ మోంటానా (జఱ్ఘఅం వీశీఅ్ఘఅఱ) స్కీ రిసార్ట్ పట్టణంలో న్యూఇయర్ పార్టీ వేడుకలలో భారీ విషాదం చోటు చేసుకుంది. స్థానిక మీడియా నివేదికల ప్రకారం, లే కాన్స్టెలేషన్ అనే బార్‌లో గురువారం తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో పేలుడు సంభవించింది, ఈ ఘటనలో ఇప్పటి వరకు 40 మంది ప్రాణాలు కోల్పోయారు.ప్రమాద సమయంలో బార్‌లో సుమారు 100 మందికిపైగా వ్యక్తులు ఉన్నారు. పేలుడు తరువాత భారీ మంటలు వ్యాపించడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన సహాయక చర్యలకు దిగారు.స్థానిక తీవంఎబవ్‌ ఘుఎం ప్రశిక్నంగా చాలా బాధితులను బయటకు తీర్చారు. అయితే, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘోర సంఘటన కొత్త ఏడాది మొదట్లో అనేక కుటుంబాల్లో విషాదాన్ని కలిగించింది.ప్రాంతీయ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ సిబ్బంది మిలితంగా పనిచేస్తూ మరిన్ని ప్రాణాలను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు.ఇప్పటివరకు 40 మంది మృతుల సంఖ్య ప్రకటించబడినప్పటికీ, మిగిలిన 60 మందిపై పరిస్థితి ఇంకా తెలియడం లేదని రిపోర్ట్.ఈ ఘోర ఘటన కారణాలు ఇంకా స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## ఎయిర్ ఇండియా పైలట్లకు డీజీసీఏ షోకాజ్ నోటీసులు

భద్రతా ప్రమాణాల ఉల్లంఘనపై ఎయిర్ ఇండియా కాక్‌పిట్ సిబ్బందికి విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ–టోక్యో మధ్య నడిచిన విమానాల్లో భద్రతా లోపాలు, నిబంధనల అతిక్రమణ ఉన్నా.. వాటిని పట్టించుకోకుండా విమానాలను నడిపినందుకు ఈ నోటీసులు పంపింది. దీనిపై రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.ముఖ్యంగా ఢిల్లీ నుంచి టోక్యో వెళ్లిన AI-357, తిరుగు ప్రయాణంలో టోక్యో నుంచి ఢిల్లీ వచ్చిన AI-358 విమానాల నిర్వహణలో లోపాలు జరిగినట్లు డీజీసీఏ గుర్తించింది. ఈ విమానాలకు సంబంధించిన 'మినిమమ్ ఎక్విప్‌మెంట్ లిస్ట్ (MEL)' నిబంధనలకు అనుగుణంగా లేదని పేర్కొంది. ఇది కేవలం ఒక్కసారి జరిగిన పొరపాటు కాదని, గతంలోనూ వేరే సెక్టార్లలో ఇలాంటి ఉల్లంఘనలే జరిగాయని డీజీసీఏ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్, సివిల్ ఏవియేషన్ నిబంధనల ప్రకారం.. బాధ్యులైన పైలట్లపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని ప్రశ్నించింది.మరోవైపు గత నెలలో ఢిల్లీ–ముంబై విమానం (AIC 887) ఇంజిన్ సమస్యతో వెనక్కి వచ్చిన ఘటనపైనా డీజీసీఏ విచారణ జరుపుతోంది. ఆ విమానం టేకాఫ్ అయిన కాసేపటికే రెండో ఇంజిన్‌లో ఆయిల్ ప్రెజర్ జీరోకి పడిపోవడంతో పైలట్లు వెంటనే ఆ ఇంజిన్‌ను షట్ డౌన్ చేసి ఢిల్లీలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ విమానాల్లో వరుసగా సాంకేతిక లోపాలు తలెత్తుతున్నా వాటిని నడపడంపై డీజీసీఏ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ ఘటనలన్నింటిపైనా డైరెక్టర్ ఎయిర్ సేఫ్టీ పర్యవేక్షణలో లోతైన దర్యాప్తు కొనసాగుతోంది.

# పాలమూరుపై విచారణ



విమర్శించారు.కృష్ణా బేసిన్‌లో నీటి పంపిణీకి సంబంధించిన ఒప్పందాలపై కూడా సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 66:34 నిష్పత్తిని అంగీకరించడం వల్ల ఏపీకి శాశ్వత ప్రయోజనం కలిగిందని, ఆ ఒప్పందాలను వరుసగా పొడిగించడం తెలంగాణకు తీరని ద్రోహమని అన్నారు. ఈ నిర్ణయాలన్నీ ఒక రాజకీయ ప్రయోజనం కోసమే తీసుకున్నట్లుగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు.రూ.27 వేల కోట్ల బిల్లులు లిఫ్టుల కంపెనీలకు చెల్లించారన్న ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి. ఇంత భారీ మొత్తంలో చెల్లింపులు జరిగినా ప్రాజెక్టు పూర్తి కాకపోవడం అనుమానాలకు తావిస్తోందని సీఎం అన్నారు. అందుకే నీటి సోర్సు మార్పు నుంచి బిల్లుల చెల్లింపుల వరకూ అన్ని అంశాలపై సమగ్ర విచారణ అవసరమని స్పష్టం చేశారు.ఈ వ్యవహారంపై విచారణకు మార్గదర్శకాలు సిద్ధం చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఎవరి ప్రయోజనం కోసం ప్రాజెక్టు రూపకల్పన మారింది, రాష్ట్రానికి ఎంత నష్టం జరిగింది అన్నది ప్రజల ముందుకు రావాల్సిందేనని అన్నారు. నిజాలు బయటపడితేనే తెలంగాణ ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.అన్ని విషయాలను శాసనసభలోనే చర్చించేందుకు సిద్ధమని చెబుతూ, కేసీఆర్ సభకు రావాలని సీఎం సవాల్ విసిరారు. తాను ఆధారాలతో మాట్లాడతానని, ఒప్పందాలు, లేఖలు, సంతకాలన్నీ బయటపెడతానని అన్నారు. పాలమూరు అంశం రాజకీయ ఆరోపణలకే పరిమితం కాకుండా, తెలంగాణ భవిష్యత్తుతో ముడిపడ్డ కీలక అంశమని ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

## రేవంత్‌కు బచావత్, బ్రిజేశ్ మధ్య తేడా తెలియదు



ప్రశ్నించారు. పీఎన్ లింక్‌పై కమిటీ వేసి ప్రజలకు తెలియకుండా దాచడం ఏపీ జలదోపిడీకి తలుపులు తెరవడమేనని ఆరోపించారు.కృష్ణా జలాల్లో తెలంగాణకు 763 టీఎంసీలు కావాలని ఇప్పుడు మాట్లాడుతున్న రేవంత్, కేసీఆర్ 299 టీఎంసీలకు ఒప్పుకున్నారని చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. నిజంగా కేసీఆర్ 299 టీఎంసీలకే ఒప్పుకుని ఉంటే రాష్ట్రం ఏర్పడిన 42 రోజుల్లోనే 811 టీఎంసీల పునర్విభజన కోరుతూ కేంద్రానికి లేఖ ఎందుకు రాశారని ప్రశ్నించారు. 71 శాతం వాటా గురించి ఈరోజు మాట్లాడుతున్న రేవంత్‌కు, ఆనాడే కేసీఆర్ 69 శాతం వాటా తెలంగాణకు కావాలని డిమాండ్ చేసిన విషయం కూడా తెలియదా? అని నిలదీశారు.కేసీఆర్‌ను విమర్శించడం సూర్యుడిపై ఉమ్మేసినట్టేనని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. తొమ్మిదేళ్ల ఉద్యమంతో తెలంగాణను సాధించి, కృష్ణా జలాల పునర్విభజన కోసం సెక్షన్3 సాధించిన నాయకుడిని అర్థం లేకుండా విమర్శించడం రేవంత్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. తుంగభద్ర నది ద్వారా ప్రతి ఏడాది 450 నుంచి 600 టీఎంసీలు శ్రీశైలంకు వస్తాయనే కనీస అవగాహన కూడా లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.జూరాలపై ఆధారపడ్డ ప్రాజెక్టులకు ఈ ఏడాది మీ ప్రభుత్వమే క్రాప్ హాలిడే ప్రకటించిందని, అదే శ్రీశైలం ఆధారిత కల్వకుర్తికి నీళ్లు ఇస్తున్నారని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై మరింత భారం మోపితే రైతులు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. పాలమూరు కోసం 90 టీఎంసీలకు డీపీఆర్ పంపి ఏడు అనుమతులు తెచ్చింది బీఆర్ఎస్, కేసీఆర్ అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు గడిచినా ఒక్క అనుమతి కూడా తెచ్చలేదని విమర్శించారు.అపెక్స్ కౌన్సిల్ సమావేశాల మినట్స్‌ను చదివి మాట్లాడాలని హరీశ్‌రావు రేవంత్‌కు సూచించారు. బ్రిజేశ్ ట్రిబ్యునల్ తుది తీర్పు వచ్చే వరకు 50:50 నిష్పత్తిలో నీటి పంపిణీ జరపాలని కేంద్రానికి ఎందుకు లేఖలు రాసారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గోబెల్స్ ప్రచారంతో నిజాలను దాచిపెట్టే ప్రయత్నాలు ఇక సాగవని స్పష్టం చేశారు.

## పాలమూరు పేరుతో బీఆర్ఎస్ ప్రజలను మోసం చేసింది: ఉత్తమ్

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.2015 జూన్ 10న రూ.35 వేల కోట్ల అంచనా వ్యయంతో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు పరిపాలన అనుమతి ఇచ్చారని ఉత్తమ్ గుర్తుచేశారు. అయితే ఆ అంచనాల్లో డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను చేర్చలేదని తెలిపారు. డిస్ట్రిబ్యూటరీలను కలిపితే మొత్తం వ్యయం రూ.80 వేల కోట్లకు మించి ఉంటుందని చెప్పారు. అలాంటప్పుడు రూ.80 వేల కోట్లలో కేవలం రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి 90 శాతం పనులు పూర్తయ్యాయని ఎలా చెబుతారని ప్రశ్నించారు.పరిపాలన అనుమతి ఇచ్చిన ఏడేళ్ల తర్వాత, 2022 సెప్టెంబర్ 13న మాత్రమే డీపీఆర్‌ను కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ)కి సమర్పించారని తెలిపారు. ఆ రోజు ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.55 వేల కోట్లుగా చూపించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరాకు కూడా నీరు అందించలేకపోయిందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలోనే రూ.7 వేల కోట్ల పనులు చేపట్టిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం వదిలి వెళ్లిన బకాయిలను కూడా చెల్లిస్తున్నామని ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణ నదీ జలాలకు నిజంగా నష్టం చేసింది బీఆర్ఎస్ పాలనేనని, ఆంధ్రప్రదేశ్‌తో అవగాహన ఒప్పందాలు చేసుకుని రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని మండిపడ్డారు.రాయలసీమ ఎత్తిపోతల పథకానికి అనుకూలంగా పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు సామర్థ్యాన్ని రోజుకు ఒక్క టీఎంసీకి తగ్గించారని ఆరోపించారు. ఈ నిర్ణయాల వల్ల తెలంగాణకు తీవ్ర నష్టం జరిగిందని, ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత తమపై ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

## బార్ కౌన్సిల్ ఎన్నికల్లో రిజర్వేషన్లకు నో

ఆశ్రయించారు.ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. బార్ కౌన్సిల్ ఎన్నికల వ్యవహారం ఇప్పటికే సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, ఎన్నికల నిర్వహణ కోసం కమిటీలను కూడా అత్యున్నత న్యాయస్థానమే నియమించిందని బెంచ్ గుర్తుచేసింది. ఈ పరిస్థితుల్లో హైకోర్టు జోక్యం చేసుకోవడం సాధ్యం కాదని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.





## మున్సిపాలిటీ వార్డుల వారీ ముసాయిదా ఓటరు జాబితా విడుదల

### ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డులపై

మిర్యాలగూడ జనవరి 1:- మిర్యాలగూడ మున్సిపాలిటీ ముసాయిదా ఓటరు జాబితా పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం కమిషనర్ జి.శ్రీనివాస్ మున్సిపాలిటీలో ప్రకటించారు. ప్రజల సమాచార మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయము , తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్ లో ముసాయిదా జాబితా అందుబాటులో ఓటరు వివరాల్లో మార్పులు చేర్పులు అభ్యంతరాలకు పురపాలక సంఘ కార్యాలయం లో ఫిర్యాదుల కేంద్రంలో స్వీకరిస్తారని ఆయన అన్నారు.ఓటర్లు, రాజకీయ పార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్ జి.జ్ఞానేశ్వరి, టిపిఎస్ అంజయ్య, సానిటరి ఇన్స్పెక్టర్ వెంకటరమణ, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.





## పులిమేడు ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ , జనవరి 1:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీ పులిమేడు ఆశ్రమంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి ప్రత్యేక పూజలో గురువారం శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ పాల్గొన్నారు.అనంతరం నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులిమేడు ఆశ్రమం ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ దేశిడి శేఖర్ రెడ్డి రెడ్డి కాలనీ లోని గడప గడపకు తిరుపతి శ్రీవారి లడ్డు ప్రసాదం పంపిణీ చేస్తున్నందుకు వారిని పులిమేడు ఆశ్రమం స్వాములను అభినందించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు దేశది శేఖర్రెడ్డి,జి.జానకిరాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు...రేవెల్ల కుమార్....



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : నూతన సంవత్సరం ను పురస్కరించుకుని ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన శేరిలింగంపల్లి డివిజన్ కు చెందిన సీనియర్ నాయకులు రేవెల్ల కుమార్ . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో మీరు తలపెట్టిన ప్రతి పని విజయం సాధించాలని, మీ ఇంటిల్లిపాదికీ సుఖసంతోషాలను, ఆరోగ్య ఐశ్వర్యాలను అందించాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నట్లు తెలిపారు.



## రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ ఎంఎల్సీ శంకర్ నాయక్ కు ఘన సన్మానం

మిర్యాలగూడ జనవరి 1:-( వార్త మిర్రర్)

తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ గా నియామకం అయినా ఎమ్మెల్సీ, మాజీ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ ను బంజారా ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎల్సి కే.శంకర్ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.గిరిజన తెగలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకొని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ముఖ్యం బంజారా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీనిచ్చారు. అనంతరం 2026 సంవత్సరం కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి సైదా నాయక్,లక్ష్మణ్ నాయక్,రవి నాయక్,వెంకన్న నాయక్, ప్రధానోపాధ్యాయులు ఎమ్.బాలాజీనాయక్, ధర్మనాయక్, గోపినాయక్, బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్, మక్లానాయక్, నెహ్రూ నాయక్, శ్రీనివాస్ రావు, నయ, కృష్ణకాంత్, సైదులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ సీపీఓలో నూతన సంవత్సరం వేడుకలు....

### ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు...

.సైబరాబాద్ సీపీ డాక్టర్ యం. రమేష్, ఐపీఎస్.శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :2026 నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ సైబరాబాద్ సీపీ డాక్టర్ యం. రమేష్, ఐపీఎస్., జాయింట్ సీపీ ట్రాఫిక్ డాక్టర్ గజరావు భూపాల్, ఐపీఎస్., డీసీపీలు, పోలీస్ సిబ్బందితో కలిసి గురువారం సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్‌లోని ఆడిటోరియంలో కేక్ కట్ చేసి సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ మాట్లాడుతూ.. డిసెంబర్ 31 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ముందస్తు ప్రణాళికతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విధులు నిర్వర్తించిన సిబ్బందిని ముందుగా సీపీ అభినందించారు. పోలీస్ సిబ్బంది అంకితభావంతో పోలీసు విధులు నిర్వర్తించాలన్నారు. అలాగే ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రజలందరికీ సీపీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్., బాలానగర్ డీసీపీ కె. సురేష్ కుమార్, ఐపీఎస్., మాదాపూర్ డీసీపీ రితిరాజ్, ఐపీఎస్., క్రైమ్ డీసీపీ ముత్యం రెడ్డి, ఎస్బీ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర, విమెన్ మరియు చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ



సాయి మనోహర్, మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# శిల్పారామం లో నూతన సంవత్సరం వేడుకలు మరియు ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళ.....



మాదాపూర్ వార్త మిర్రర్ : శిల్పారామం మాదాపూర్ లో నూతన సంవత్సరం మరియు ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళ సందర్భంగా సందర్శకుల అధిక సంఖ్యా లో విచ్చేసారు. చేనేత హస్తకళా ఉత్పత్తులు కొనుగోలు చేసారు. శిల్పారామం ప్రకృతి అందాలను తిలకించారు. బోటింగ్, వాటర్ ఫాల్స్, విల్ఏజ్ మ్యూసియం, బృందావన్ , బర్డ్స్ పార్క్, ప్లే ఏరియా



పరిసరాలను తిలకించారు. ఏంపీతేత్రే లో శ్రీ సంజయ్ జోషి బృందం కథక్ నృత్య ప్రదర్శన , శ్రీమతి సంధ్య కార్తీక్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, నృత్య భూమి డాన్స్ ఇన్స్టిట్యూట్ కటక్ వారి ఒడిసి మరియు సంబల్పూరి నృత్య ప్రదర్శనలు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శన , సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ వారి గారడీ గోమ్బ్ నృత్యప్రదర్శనాలు ఎంతగానో అలరించాయి.

# పోపా ఆధ్వర్యంలో నూతన సంత్సర వేడుకలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 1జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని మార్కండేయ దేవాలయ ఆవరణలో గురువారం పద్మశాలి అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ (పోపా) ఆద్వర్యంలో నూతన సంత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సహకార సంఘం అవార్డు అందుకున్న సిఈఓ రవికుమార్ ను సంఘ సభ్యులు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాసరి రామస్వామి, దాసరి కృష్ణహరి, సిరిపురం మహేష్, మాచర్ల స్వప్న, కడకుంట్ల జగదీశ్వర్, ఎలిగేటి నరేష్, కస్తూరి శివానందం, కడకుంట్ల అభయ్ రాజ్, వినోద్, దావాన్పల్లి సురేందర్, కటకం మధుసూదన్, మాచర్ల మహేష్, తాటిపాముల రమేష్, సామల్ల రాజ్ కిరణ్, సింగని నరేష్, ఉడుత రమేష్, కస్తూరి సతీష్, ఉషకోల రాము తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన యూత్

### కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జెక్కిడి శివ చరణ్ రెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డి

ఎల్బీనగర్ 1 జనవరి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని టిపిసిసి ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని తన నివాసంలో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి పూల బోకేను అందజేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి వారికి చేరే విధంగా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జెక్కిడి శివ చరణ్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి కలిసిన వారిలో ఎల్బీనగర్ యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు జక్కిడి సత్య తేజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# లాలాపేట్ కార్తీక గార్డెన్‌లో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ .....

### 25 వ సారి అయ్యప్ప మాలధారణ చేసిన ఎల్ఎల్బి శ్రీనివాస్ గురుస్వామి కి గజమాలతో ఘన సన్మానం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 1....లాలాపేట్ కార్తీక్ గార్డెన్‌లో అయ్యప్ప మహా పడిపూజను భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత 25 సంవత్సరాలుగా అయ్యప్ప స్వామి మాల ధరిస్తున్న సందర్భంగా ఎల్.ఎల్.బి. శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో కలశ పూజ, అయ్యప్ప స్వామికి అభిషేకం, మహా పడిపూజ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తుల నడుమ శ్రద్ధగా నిర్వహించారు. 25 సంవత్సరాల అయ్యప్ప స్వామి మాల ధారణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఎల్.ఎల్.బి. శ్రీనివాస్ గురుస్వామిని అయ్యప్ప స్వాములు గజమాలతో సత్కరించారు. ఈ పూజా కార్యక్రమానికి రామేశ్వర రావు, త్రినేత్ర తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రమేష్ గురుస్వామి, బాబా అశోక్, మామ శీను, రైల్వే శీను, మల్లికార్జున్, గణేష్ యాదవ్, పరశురాం, వెంకట్, దుర్గాప్రసాద్, చరణ్, స్వరాజ్, క్రాంతి, వికాస్, రాకేష్, ప్రణయ్, వీరప్ప, సాయి యాదవ్, జగన్ రెడ్డి, పలు



పార్టీల నేతలు, సన్నిహితులు:పోచయ్య యాదవ్, సునీల్ ముదిరాజ్, కిషోర్ యాదవ్, ఎం.ఆర్. శ్రీనివాస్, బాలరాజు, డాన్ యాదవ్, జగన్ ముదిరాజ్, సందీప్, కుటుంబ సభ్యులుసరిత, అరవింద్, శైలు, సాయి, త్రిషిక, జస్విక, మణికంఠ, షణ్ముఖ్, అవంతిక పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# దేవరకొండ తాపీ సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్,వార్డు మెంబర్లకు సత్కారం

దేవరకొండ జనవరి 1 వార్త మిర్రర్ :::::దేవరకొండ మండలంలో స్థానిక సర్పంచ్ ఎన్నికలలో గెలపొందిన తాపీ కార్మికులు సర్పంచ్ వార్డ్ మెంబర్లకు దేవరకొండ మండల కేంద్రంలో గురువారం నాడు తాపీ కార్మిక సహకార సంఘం దేవరకొండ సంఘం వారు వారిని రాలువాలతో సత్కరించారు. సత్కరించిన వారిలో గాజీ నగర్ సర్పంచ్,బుడగపాక వెంకటయ్య ఉపసర్పంచ్ బత్తుల సత్యనారాయణ,1వ వార్డు మెంబర్ పేట లింగయ్య, 4వ వార్డ్ మెంబర్ జక్కుల మదర్ 6వ వార్డ్ మెంబర్ పేట కిరణ్, 8 వార్డు మెంబర్ బంగారు వెంకటయ్య, కొండ భీమనపల్లి 2 వార్డు మెంబర్ అందుగుల వెంకటయ్య, కాసారం గ్రామ 5వ వార్డ్ నెంబర్ ముదిగొండ సాలయ్య, పైదోని ఒంపు గ్రామ 2 వ వార్డ్ నెంబర్ నల్లగాసు ఎల్లయ్య లను రాములు నాయకత్వంలో వీరందరినీ శాలబాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపొంది ఆయా పదవులను ఉన్నవారు వారి గ్రామానికి అభివృద్ధి పరమైన పనులలో భాగస్వాములై గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన అన్నారు.





# అదిరే స్టిల్‌తో మన శంకర వరప్రసాద్ గారు

మెగాస్టార్ చిరంజీవి మాస్-అండ్-ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంఅద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్ తో సంచలనం సృష్టిస్తోంది.విక్టరీ వెంకటేష్ కీలకమైన ప్రత్యేక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తుండగా, శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు.షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.తాజాగా మేకర్స్ సినిమా నుంచి రిలీజ్ చేసిన మెగాస్టార్ చిరంజీవి కొత్త స్టిల్ అదిరిపోయింది. బ్లాక్ సూట్, వైట్ షర్ట్, కళ్లకు డార్క్ గ్లాసెస్ తో ఒక చేతిలో గన్ పట్టుకుని స్టైలిష్‌గా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్న మెగాస్టార్ స్టిల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఇప్పటికే మీసాల పిల్ల, శశిరేఖ పాటలు చార్ట్‌బస్టర్ హిట్స్ గా సంచలనం సృష్టించాయి. అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న చిరంజీవి, వెంకటేష్ పై చిత్రీకరించిన పాటని రిలీజ్ చేయబోతున్నారు. దీనికి సంబంధించిన అనౌన్స్ మెంట్ త్వరలోనే రాబోతోంది. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న మన శంకర వర ప్రసాద్ గారు జనవరి 12న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది.





# 'శంబాల' లాంటి చిత్రాల్ని థియేటర్లో చూస్తేనే ఆ ఫీల్‌ను ఎంజాయ్ చేయగలుగుతారు

**::: హీరో ఆది సాయి కుమార్**

ఆది సాయి కుమార్ హీరోగా తెరకెక్కిన 'శంబాల' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ 23న ఆది సాయి కుమార్ పుట్టిన రోజు సందర్భంగా మీడియాతో ముచ్చటిస్తూ 'శంబాల' గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు. 'శంబాల' చిత్రం బాగా వచ్చింది. ఆడియెన్స్‌కి మా సినిమా బాగా నచ్చుతుంది.'శంబాల' చిత్రంలో అద్భుతమైన పోరాట సన్నివేశాలున్నాయి. రాజ్ కుమార్ మాస్టర్ అన్ని యాక్షన్ సీక్వెన్స్‌కి రిహార్సల్స్ చేశారు. దర్శకుడు యుగంధర్‌తో పాటుగా రాజ్ కుమార్ ట్రావెల్ చేశారు. క్లైమాక్స్‌లో వచ్చే యాక్షన్ సీక్వెన్స్ అదిరిపోతుంది. 80వ దశకంలో వచ్చే కథ కాబట్టి.. లుక్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. అందుకే కాస్ట్యూమ్స్ ని చాలా సెలెక్టివ్‌గా తీసుకున్నాం.'శంబాల' చిత్రంలో ఎక్కువ వీఎఫ్ఎక్స్ షాట్స్ ఉండవు. కానీ ఉన్న వాటిని మాత్రం చాలా జాగ్రత్తగా చేసుకున్నాం. ఆ అవుట్ పుట్ చూసి మేం అంతా సంతృప్తి చెందాం. 'శంబాల' అనేది ఉందా? లేదా? అనేది ఎవ్వరికీ తెలీదు. మన పురాణాల ప్రకారం శంబాలకి ఓ మంచి గుర్తింపు ఉంది. శంబాల అని టైటిల్ చెప్పినప్పుడే నేను చాలా ఎగ్జైట్ అయ్యాను.యుగంధర్‌కి సినిమా పట్ల చాలా ప్యాషన్ ఉంటుంది. యుగంధర్ గారి మొదటి చిత్రం నాకు చాలా ఇష్టం. ఈ కథ కోసం ఆయన చాలా కష్టపడ్డారు. చెప్పిన కథను తెరపై చూపించారు. ఆయన పెద్ద డైరెక్టర్ అవుతారు. నిర్మాతలు ఎంతో ప్యాషన్‌తో 'శంబాల'ని నిర్మించారు. మేం ఎక్కడా కూడా వేస్టేజ్ చేయకుండా సినిమాను తీశాం. నా మార్కెట్ కంటే ఎక్కువగానే ఖర్చు పెట్టారు అన్నారు.

# సిగ్మా టీజర్ రిలీజ్

సుబాస్కరన్ లైకా ప్రొడక్షన్స్ మరో ప్రతిష్టాత్మక వెంచర్ సిగ్మా తో రాబోతోంది. ఈ సినిమాతో కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సందీప్ కిషన్ హీరో నటిస్తున్న ఈ చిత్రం యాక్షన్-అడ్వెంచర్ కామెడీగా రూపొందుతోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ కు అద్భుతమై రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ అదిరిపోయే టీజర్ రిలీజ్ చేశారు. దర్శకుడిగా జేసన్ సంజయ్ తొలి అడుగే బలమైన స్టేట్‌మెంట్‌లా కనిపిస్తుంది. స్టైలిష్‌గా, హై-ఆక్టేన్ కట్స్‌తో రూపొందిన ఈ టీజర్‌లో ఆయన కాన్ఫిడెన్స్ స్పష్టంగా కనిపిస్తుంది. ఎస్. తమన్ అందించిన దుమ్మురేపే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ఎనర్జీ, ఇంటెన్సిటీని మరింత పెంచింది. సందీప్ కిషన్ అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో టీజర్ లో అదరగొట్టారు. యాక్షన్, ఇంటెన్సిటీ, ఎనర్జీమూడు అంశాల్లోనూ ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ అదిరిపోతుంది. అంతర్గత సంఘర్షణ, ఆశయం, సహజ స్వభావంతో మలచబడిన పాత్రలో ఆకట్టుకున్నారు. సందీప్ కిషన్‌కు జోడీగా ఫరియా అబ్దుల్లా నటిస్తుండగా, రాజు సుందరం, అన్బు థాసన్, యోగ్ జాపీ, సంపత్ రాజ్, కిరణ్ కొండ, మహాలక్ష్మి సుధర్శనన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కేథరిన్ ఒక హై-ఎనర్జీ స్పెషల్ సాంగ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. మల్టిలింగ్వల్ చిత్రంగా రూపొందుతున్న సిగ్మా 2026 సమ్మర్‌లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.



# పునర్జన్మల 'గత వైభవం'

పురాణ గాథల్లోని దేవలోకం నుంచి స్వాతంత్ర్యానికి పూర్వం వరకు నాలుగు విభిన్న కాలాల నేపథ్యంలో పునర్జన్మల కథాంశంతో రూపొందిన కన్నడ చిత్రం 'గత వైభవ'. నవంబర్‌లో విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రం 'గత వైభవం' పేరుతో జనవరి 1న తెలుగులో విడుదలకు సిద్ధమవుతున్నది. ఎస్ఎస్ దుష్యంత్, అషికా రంగనాథ్ జంటగా నటించిన ఈ చిత్రానికి సునీ దర్శకుడు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. పురాణాలు, పునర్జన్మ, చారిత్రక ఘట్టాల కలబోతగా విజువల్ వండర్‌గా మెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు.

# 'మ్యాజిక్ డిస్ట్రిక్ట్' ప్రారంభం



కొండాపూర్ లోని ఇవీదీ మాల్‌లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లో ఆసియాలోనే మొట్టమొదటి రియల్-లైఫ్ మల్టీ-థీమ్ అడ్వెంచర్ డెస్టినేషన్ 'మ్యాజిక్ డిస్ట్రిక్ట్' ప్రారంభమైంది. AMB మాల్‌లోని 6వ అంతస్తులో సుమారు 38,000 చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేశారు. ఇది కేవలం చూసే వినోదం మాత్రమే కాదు, సందర్శకులు స్వయంగా కథలో పాత్రధారులుగా మారి నడుస్తూ సాహసాలను అనుభవించే సరికొత్త ఫార్మాట్.నేషనల్ అవార్డు గ్రహీత, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్ తవ్వ శ్రీనివాస్ ఈ 'మ్యాజిక్ డిస్ట్రిక్ట్'కు రూపకల్పన చేశారు. భారతీయుల మేధస్సు, సృజనాత్మకతను ప్రపంచానికి చాటిచెప్పడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. భారతీయ ప్రజలకు సరికొత్త సాహసాలను పరిచయం చేసేందుకు మా కూతురు, ఆపరేషన్ మేనేజర్ చందన లిపి అమెరికాలో జాబ్ వదిలేసి వచ్చింది. ఈ ఫేస్ 1 ఇప్పుడు ప్రారంభించాము అన్నారు తవ్వ శ్రీనివాస్. ఆపరేషన్ డైరెక్టర్ చందన లిపి మాట్లాడుతూ... మొదటి దశలో నాలుగు సాహస ప్రపంచాలను అందుబాటులోకి తీసుకొచ్చాము అన్నారు.

# మంటల్లో కార్తీక్ రాజు.. విలయ తాండవం ఫస్ట్ లుక్ వైరల్

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ కార్తీక్ రాజు. కౌసల్య కృష్ణమూర్తి, అథర్వ సినిమాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు కార్తీక్ రాజు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న కార్తీక్ రాజు నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి విలయ తాండవం . ఈ మూవీకి వీఎస్ వాసు దర్శకత్వం వహిస్తున్నాడు. పార్వతి అరుణ్, పుష్ప ఫేం జగదీష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో బ్యాక్‌డ్రాప్‌లో మంటలు, ఆ మంటల్లో కాలిపోతున్న వస్తువులు, కింద పడిపోయి ఉన్న ఫొటోఫ్రేమ్, హీరో తలకు కట్టు, ఓ చేతిపై మంటలు చెలరేగడం వంటి దృశ్యాలను చూడొచ్చు. కార్తీక్ రాజు క్యారెక్టర్ ఏదో సీరియస్ టాపిక్‌పై ఇంటెన్స్ గా సాగబోతున్నట్టు పోస్టర్ హింట్ ఇచ్చేస్తుంది. షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని మేకర్స్ పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్టు ఇన్‌సైడ్ టాక్. ప్రొడక్షన్ నెంబర్ 1గా వస్తోన్న ఈ చిత్రాన్ని మందల ధర్మారావు, గుంపు భాస్కర రావు జీఎంఆర్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.

